# యువ కార్మికుల చూపు ఎటువైపు..?

- సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో వారి ఓట్లే ప్రధానం
- గతంలో సాధించిన హక్కులను ఆదరిస్తారని టీబీజీకేఎస్ ధీమా
- యువ కార్మికులను ప్రసన్నం చేసుకునే పనిలో జాతీయ సంఘాలు

రామగిరి, డిసెంబర్ 15: ఇటీవలే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ప్రస్తుతం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు అదే స్థాయిలో జరగబోతున్నాయి. సింగరేణిలో ప్రస్తుతం యువ కార్మికుల ఓట్లే ప్రధానం కానుండగా, వారిని ప్రసన్నం చేసుకునేందుకు జాతీయ సంఘాలు ఒక్కో దారిని ఎంచుకుంటున్నాయి. గుర్తింపు సంఘం కాల పరిమితి గతంలోనే ముగియగా కార్మిక శాఖ అధికారులు గతంలోనే ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పుడే ఎన్నికలు వద్దంటూ పలు కార్మిక సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అప్పుడు వద్దన్న జాతీయ సంఘాలే ఇప్పుడు ఎన్నికలపై ఉత్సాహం ప్రదర్శిస్తుండడం గమనార్హం. ఈనెల 27న సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తున్నది. టీబీజీకేఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ సంఘాలు బరిలో నిలుస్తున్నాయి. ఆయా సంఘాల నాయకులు గనులపైకి వెళ్లి సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. గతంలో కార్మికుల హక్కులను పోగొట్టి అపవాదు మూట గట్టుకున్న కార్మిక సంఘాలు కూడా తమతోనే హక్కులు సాధ్యమంటూ ప్రచారాలు చేయడం కార్మిక వర్గానికి విస్మయానికి గురి చేస్తున్నది. కాగా, ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో 11 ఏరియాల్లో మొత్తం 39,748 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటి వరకు గుర్తింపు సంఘంగా కొనసాగిన బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గతంలో కార్మికులకు సాధించి పెట్టిన దాదాపు 40కి పైగా హక్కులను చూపుతూ ప్రచారం చేస్తున్నాయి. కారుణ్య నియామకాల ద్వారా టీబీజీకేఎస్ హయాంలో దాదాపు 20వేల చిలుకు డిపెండెంట్లు ఉద్యోగాల్లో చేరారు. దీన్ని బట్టి చూస్తే ఈ ఎన్నికల్లో యువ కార్మికుల ఓట్లే కీలకం కానుండడంతో వారంతా ఏ యూనియన్‌ను ఆదరిస్తారనేది చర్చనీయాంశమైంది. గతంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో వారసత్వ ఉద్యోగాలకు సింగరేణిలో చరమగీతం పాడింది. 1998కి ముందు సింగరేణిలో 1.16లక్షల మంది కార్మికులు ఉంటే జాతీయ సంఘాల వైఖరితో వారి సంఖ్య ఏటేటా గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత ఆ యూనియన్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, కోల్‌బెల్ట్ ఎంపీలు, ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లి వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరణకు కృషి చేశారు. దాంతో అప్పటి సీఎం కేసీఆర్ వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించాలని సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేశారు. జాతీయ సంఘాలు మరోసారి కోర్టుకు వెళ్లి నిలుపుదల చేశాయి. దీనితో కారుణ్య నియామకాలను సింగరేణిలో అమలు చేయించడంలో టీబీజీకేఎస్ విజయం సాధించింది. ఆ దరిమిలా ఇప్పటివరకు కార్మికుల డిపెండెంట్లు దాదాపు 20వేల చిలుకు యువ కార్మికులు ఉద్యోగాల్లో చేరారు. కారుణ్య పథకం అమలు కాని పక్షంలో ఇప్పుడు ఉన్న 39వేల మంది కార్మికుల్లో సగం మంది కార్మికుల సంఖ్య తగ్గి ఉండేది. ఈ లెక్కన చూస్తే యువ కార్మికుల ఓట్లే కీలకం కానుండటంతో టీబీజీకేఎస్‌కు కొంతమేరకు అనుకూలించే అవకాశం కనిపిస్తున్నది. యూనియన్ నాయకత్వం కూడా అదే ధీమాతో ముందుకు సాగుతుంది.

**రాష్ట్రంలో దోస్తీ... సింగరేణిలో కటీఫ్...**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. సింగరేణి ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం ఇక్కడ ఎవరికివారుగా బరిలోకి దిగారు. నిన్నటి వరకు గనులపైకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరిన ఏఐటీయూసీ నాయకులు ఇప్పుడు అదే కార్మికుల మధ్యకు వెళ్లి ఐఎన్‌టీయూసీని ఆదరిస్తే ప్రభుత్వ యూనియన్‌గా నిస్సహాయ స్థితిలో ఉంటుందనీ, ఏఐటీయూసీని ఆదరిస్తే కార్మిక హక్కులపై పోరాడుతామంటూ ప్రచారాలు చేయడంతో కార్మిక వర్గం విస్మయానికి గురవుతున్నది.

**యువ కార్మికుల ఇండ్లకు....**

కాగా, ఈ ఎన్నికల్లో యువ కార్మికుల ఓట్లే ప్రధానం కావడంతో జాతీయ సంఘాలు యువ కార్మికులపైనే దృష్టి కేంద్రీకరించాయి. గతంలో కారుణ్య నియామకాలు సాధించి పెట్టిన ధీమాతో టీబీజీకేఎస్ యూనియన్ ఉంటే, జాతీయ సంఘాలు మాత్రం కొత్త దారులను ఎంచుకున్నాయి. ఇప్పుడు ఆయా గనుల్లో పని చేస్తున్న యువ కార్మికుల వివరాలు సేకరించి గతంలో వారి తండ్రులు పని చేసిన గనులు, అప్పుడు వారు ఏ యూనియన్‌కు మద్దతు గా నిలిచారో కూపీ లాగుతున్నారు. యువ కార్మికుల ఇండ్లకు నేరుగా వెళ్లి వారి తండ్రులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఏదిఏమైనా సింగరేణిలో జరిగే ఎన్నికల్లో యువ కార్మికులు ఏ యూనియన్ వైపు మొగ్గు చూపుతారో చూడాలి.

**గుర్తింపు ఎన్నికలపై సస్పెన్స్...**

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు అటు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా, ఇటు కార్మిక సంఘాల నాయకులు పోటాపోటీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రస్తుత ప్రభుత్వ ఎనర్జీ సెక్రటరీ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎన్నికలు వాయిదా వేయాలని కోర్టుకు అభ్యర్థించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈనెల 18న వాదోప వాదాలు జరుగుతాయని తెలిసింది. కోర్టు తీర్పు ఎలా వస్తుందోనని కార్మిక వర్గంలో ఉత్కంఠ నెలకొంది. సింగరేణిలో ఏఐటీయూసీ యూనియన్ ఒంటరిగా పోటీ చేయడంతో ఓటమి భయంతో ఎన్నికలు వాయిదా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఐఎన్‌టీయూసీ కంటే ఏఐటీయూసీకే ఎక్కువ ఆదరణ ఉండడంతో ఓడిపోయే పరిస్థితి ఉన్నట్లు గ్రహించి ఎన్నికలు వాయిదా వేసేందుకే మొగ్గు చూపుతున్నట్లు జోరుగా చర్చ జరుగుతోంది.

## ఎమ్మెల్యేకు ఆహ్వానం

గోదావరిఖని, డిసెంబర్ 15: రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గెలిస్తే రాంనగర్ అయ్యప్ప ఆలయంలో 10,016 కొబ్బరి కాయలు కొడతానని మొక్కుకున్నట్లు కాంగ్రెస్ నాయకుడు కట్కు ధనుంజయ తెలిపారు. ఈనెల 20న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని మక్కాన్‌సింగ్‌ను కోరారు.

## డిప్యూటీ తహసీల్దార్‌గా తిరుపతి

జ్యోతినగర్, డిసెంబర్ 15: రామగుండం డిప్యూటీ తహసీల్దార్‌గా ఎం తిరుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గోదావరిఖనిలోని భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న తిరుపతిని రామగుండం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఎలిగేడు మండలానికి బదిలీ అయ్యారు. రామగుండం తహసీల్దార్ కుమారస్వామి సెలవులో వెళ్లడంతో పాలకుర్తి తహసీల్దార్ ఎం జ్యోతి రామగుండం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

## మంథని మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ

మంథని, డిసెంబర్ 15: మంథని మున్సిపల్ కమిషనర్‌గా ఎన్ బాలకృష్ణ నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్న బాలకృష్ణను మంథని మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ పీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రంగారెడ్డి జిల్లా అమంగల్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీశ్ ఇప్పటి వరకు మంథని మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

# యేసు క్రీస్తు బోధనలు అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్, క్రైస్తవులు

మంథని రూరల్, డిసెంబర్ 15: యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని బిట్టుపల్లి సర్పంచ్ పోగుల సదానందం అన్నారు. సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో బిట్టుపల్లి ధర్మారం గ్రామాల్లో శుక్రవారం క్యారల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు జననం ప్రాముఖ్యతనును వివరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు అజ్మీరా దయారాజ్, పెండ్రు ప్రసన్న కుమార్, గద్దల రాజేశ్, మంథని మార్క్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, మంథని సదానందం, వెంకటేశ్, శంకర్, కొయ్యల కృష్ణస్వామి, హనుమంతు రాజేశ్, డాని పాల్గొన్నారు.

## డీజీఎంఎస్‌కు స్వాగతం

గోదావరిఖని, డిసెంబర్ 15: జాతీయ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల ముగింపు వేడుకలకు వచ్చిన డీజీఎంఎస్ ప్రభాత్ కుమార్, డిప్యూటీ డీజీఎంఎస్ భూషణ్ ప్రసాద్ సింగ్, సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, జీ.వెంకటేశ్వరరావులకు శుక్రవారం ఆర్జీ-1 బంగ్లాస్ ఏరియాలో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఘనంగా స్వాగతం పలికారు. సేఫ్టీ జీఎం గురు వయ్య, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, సైదులు, రామ్మోహన్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం,డిసెంబర్15: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు బండవరం సుమన్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఇటీవల సుమన్ తల్లి పద్మావతి అనారోగ్యంతో చనిపోయింది. శుక్రవారం రాత్రి సుమన్ ఇంటికి వెళ్లి పద్మావతి ఫొటోపై పూలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నాడెం శ్రీనివాస్,కాంపెల్లి చంద్ర శేఖర్, రేగుల జితేందర్, దేవి నళినీకాంత్,పాక వెంకటేశ్,ఐత వెంకట స్వామి,జలేందర్ రెడ్డి,ఎలేటి క్రిష్ణారెడ్డి, గాజుల మల్లేశం, సింహాచలం జగన్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

జగిత్యాల, డిసెంబర్ 15: డిమాండ్లను పరిష్కరించాలని తపాలా శాఖలోని గ్రామీణ డాక్ సేవక్‌ల సమ్మె శుక్రవారం నాల్గోరోజు కొనసాగింది. జగిత్యాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.ఏడో పీఆర్సీ నివేదికలోని సిఫారసులు అమలు చేయాలని కోరారు.

## సింగరేణి ఆవిర్భావ వేడుకలపై సమీక్ష

గోదావరిఖని, డిసెంబర్ 15: సింగరేణి ఆవిర్భావ వేడుకలపై ప్రైవేట్, సింగరేణి విద్యా సంస్థల కరస్పాండెంట్లు, సేవా సమితి సభ్యులతో ఆర్జీ-1 ఏజీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, కో-ఆర్డినేటింగ్ అధికారి బంగారు సారంగపాణి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ ఈనెల 23న స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పాఠశాలల విద్యార్థులు వినోదాత్మక, ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు, యువతులకు ఈ నెల 20 న జీఎం కాలనీ గ్రౌండ్‌లో దీపాలంకరణ, ముగ్గుల పోటీలు నిర్వహించాలని, ఉద్యోగుల క్వార్టర్లకు గృహ శోభ పోటీలు, 21న మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి కో-ఆర్డినేటర్ మేడి తిరుపతి, డాన్స్ మాస్టర్లు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సమ్మక్క గద్దెల వద్ద డంప్‌యార్డు తొలగించాలి

కోల్‌సిటీ, డిసెంబర్ 15: గోదావరిఖని శివారులోని గోదావరి వద్ద సమ్మక్క గద్దెల సమీపంలోని మున్సిపల్ చెత్త డంప్ యార్డును తొలగించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ కోరారు. ఈ మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు రామ గుండంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయ డంపై అభినందనలు తెలిపారు. సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా గోదావరిఖని శివారు గోదావరి వద్ద జరిగే మినీ మేడారం జాతరకు రెండు జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. సమ్మక్క గద్దెల సమీపంలోనే ఏర్పాటు చేసిన చెత్త డంప్ యార్డుతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. డంప్ యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలని కోరారు. రామగుండం మెడికల్ కళాశాలలో ఉద్యోగ నియామకాలు రోస్టర్ పద్ధతి ప్రకారం, మెరిట్ అండ్ పేపర్ నోటిఫికేషన్ ద్వారా డిస్ట్రిక్ట్ కమిటీ ఎంపిక చేయాలని కోరినట్లు తెలిపారు. వీటికి సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి గడప శ్రీకాంత్ ఉన్నారు.

## యాజమాన్యంతో కొట్లాడి హక్కులు సాధిస్తాం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబర్ 15: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపిస్తే యాజమాన్యంతో కొట్లాడి హక్కులు సాధిస్తామని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కే స్వామి, ఆరెల్లి పోచం, రంగు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్జీ-1 జీడీకే-2ఏ, ఏరియా వర్క్‌షాపులో శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు గౌతం గోవర్ధన్, సతీశ్‌బాబు, గండి ప్రసాద్, పెర్క రమేశ్, శంకర్, మహేందర్, నాగేందర్, వెంకన్న, రాజేశ్వరరావు, సోహెల్, రవి, దొంత సాయన్న, రాజకిశోర్, దేవేందర్ రెడ్డి, కన్నం లక్ష్మీనారాయణ, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## 12 గ్యారంటీలు అమలు చేయిస్తాం




కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబర్ 15: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూనీ గెలిపిస్తే 12 గ్యారంటీలను అమలు చేయిస్తామని ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, నరసింహారావు అన్నారు. జీడీకే-1,3, ఓసీపీ-5లో శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గోదావరిఖని శ్రామిక భవన్‌లో 12 గ్యారంటీలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, నరహరి రావు, గౌస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రవీణ్, సతీశ్, మల్లేశ్, సంపత్, కార్తీక్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

జ్యోతినగర్, డిసెంబర్ 15: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కారు డ్రైవర్ గొర్రె రాజు ఇటీవల ఆనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు శుక్రవారం రూ. 5 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. సేవా సమితి సభ్యురాలు గాండ్ల స్వరూప తన వంతుగా, రూ. 500 ఇచ్చారు. బాధిత కుటుంబానికి దాతలు అండగా నిలవాలని శ్రీ సీతారామ సేవా సమితి సభ్యురాలు చంద్రకళ కోరారు.